క్లుప్తంగా

ఏడీకి వినతి



రాజోళి: వారం రోజుల కిందట 'నేతన్నల ఘోస' శీర్షికతో కథనం సాక్షిలో ప్రచురితం అయ్యింది. దీంతో చేనేత శ్రామిక సేవా సమితి సభ్యులు వీరేష్, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు నిషాక్‌లు చేనేత కార్మికులతో కలిసి శుక్రవారం చేనేత జౌళి శాఖ ఏడీ గోవిందయ్యకు వినతి పత్రం అందించారు. పవర్ లూమ్ మగ్గాలపై తయారైన చీరలు, చేనేత చీరలు ఒకే చోట అమ్మకాలు చేస్తుండటంతో చేనేత చీరలకు గిరాకి తగ్గి ఉపాధి కోల్పోతున్నామని వారు వాపోయారు. సాక్షి పేపర్లో ప్రచురితమైన కథనానికి సంబంధించిన కటింగ్‌ను వినతిపత్రానికి జత చేసి ఇచ్చారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

అనాథలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

గద్వాల అర్బన్: అనాథ పిల్లలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అనాథల హక్కుల పోరాట సమితి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో అనాథల అరిగోస దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ పిల్లలకు ఓట్లు లేవన్న ఉద్దేశ్యంతో వారి సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికొదిలేశారని మండిపడ్డారు. 2016లో యాదగిరి గుట్టలో అనాథ పిల్లల కోసం హాస్టల్ ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని, స్మార్ట్ కార్డులు అందజేయాలని, మంత్రి వర్గ ఉప సంఘం సిఫార్సులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో నాయకులు అశోక్, కన్నా, మన్యం, రంజిత్, పరుశరామ్, నాగరాజు, ఆంజనేయులు, చరణ్, తిమ్మన్న, సంతోష్ ఉన్నారు.

హెచ్‌ఎంపై విచారణ

గట్టు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఇటిక్యాల ఎంఈఓ రాజు విచారణ నిర్వహించారు. ఇటీవల సర్పంచ్ ధనలక్ష్మి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంపై మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులతో డబ్బులు వసూలు చేశారని, పాఠశాలకు విరాళంగా ఇచ్చిన వస్తువులను అమ్ముకున్నారని సర్పంచ్ ధనలక్ష్మి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈఓ పాఠశాలకు చేరుకొని విచారణ చేశారు. విచారణ నివేదికను జిల్లా విద్యాధికారికి అందజేస్తానని విచారణ అధికారి రాజు తెలిపారు.

ఉన్నత పాఠశాలలో ప్రొజెక్టర్ చోరీ

గట్టు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రొజెక్టర్ చోరీకి గురైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఉపాధ్యాయుల వివరాల ప్రకారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో ప్రయోగాత్మకంగా పాఠాలను బోధించేందుకు పాఠశాలలో ప్రొజెక్టర్‌ను అమర్చారు. గురువారం పాఠశాల పని వేళ ముగిసిన తర్వాత తాళాలు వేసి వెళ్లారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాలలోకి ప్రవేశించి ప్రొజెక్టర్‌ను ఎత్తుకెళ్లారు. యథావిధిగా శుక్రవారం ఉపాధ్యాయులు పాఠశాలకు రాగా దొంగతనం జరిగినట్లు భావించారు. తరగతి గదిలో పరిశీలించగా ప్రొజెక్టర్ చోరీకి గురైనట్లు గుర్తించారు. దీని విలువ సుమారు 33 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



వెంకట్రామయ్య

అలంపూర్ రూరల్: మండలంలోని లింగన్‌వాయి గ్రామానికి చెందిన అడ్డాకుల వెంకట్రామయ్య (50) అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ వివరాల ప్రకారం ఈ నెల20వ తేదీన వెంకట్రామయ్య పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువుల, మిత్రుల ఇళ్లలో వాకబు చేశారు. దీంతో శుక్రవారం అతడి భార్య వెంకటేశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. సమాచారం తెలిస్తే సెల్: 8712670285 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.



పెద్ద ఆంజనేయులు (ఫైల్)

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో గ్రామానికి చెందిన కుర్వ పెద్ద ఆంజనేయులు (50) అదృశ్యమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల ప్రకారం రెండెకరాల భూమి పంపకం విషయంలో మనస్తాపానికి గురై ఆంజనేయులు ఆరు రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారికి ఫోన్‌లు చేసి ఆరా తీశారు. ఎక్కడా ఆచూకి లభించకపోవడంతో శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆంజనేయులు కూతురు కుర్వ అఖిల ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా ఒలింపిక్ రన్



క్రీడాజ్యోతితో ఒలింపిక్ రన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు

- ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి : డీవైఎస్ఓ

గద్వాల: గద్వాల జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో గురువారం ఒలింపిక్ దినోత్సవం రన్ ఎంతో ఉత్సాహంగా సాగింది. ఆయా పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఈ పరుగులో పాల్గొన్నారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం, జిల్లా ఒలింపిక్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి రమేష్‌బాబు హాజరయ్యారు. క్రీడాజ్యోతిని వెలిగించి పరుగును ప్రారంభించారు. కాసేపు క్రీడాకారులతో కలిసి పరిగెత్తి వారిలో ఉత్సాహాన్ని నింపారు. పట్టణ ప్రధాన రహదారుల వెంట ఒలింపిక్ పరుగు సాగింది. జిల్లా కేంద్రంలో ఉదయం క్రీడాకారులు, చిన్నారుల సందడితో రహదారులు కిక్కిరిసిపోయాయి. జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ చాటిన 12 మంది క్రీడాకారులు ఒలింపిక్ కాగడా పట్టుకుని పరుగులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులనుద్దేశించి డీవైఎస్ఓ రమేష్‌బాబు మాట్లాడారు. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు జరిగిన కాలంలో విశ్వశాంతి, స్నేహహస్తం కోసం క్రీడలు ఎంతో దోహద పడతాయని భావించిన ప్రజలు ఆనాడు క్రీడాజ్యోతితో ఒలింపిక్ పరుగును ప్రారంభించారని.. ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడల లో ప్రతిభ, నైపుణ్యం ఉన్నవారిని ప్రోత్సహించి నజరానా అందిస్తుందని చెప్పారు. క్రీడారంగంలో రెండుశాతం రిజర్వేషన్లను ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. క్రీడాకారులకు ఒలింపిక్ డే ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీఎస్ ఆనంద్, జిల్లా వ్యా యామ ఉపాధ్యాయ సంఘం కృష్ణయ్య, కరాటే మాస్టర్ శ్రీహరి, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్స్ వీరావసంతరాయుడు, అబ్రహం, ప్రభాకర్, విజయబాబు, జితేందర్, బీసన్న, సతీష్, నగేష్‌బాబు, రజనికాంత్, పాల్గొన్నారు.

ఉద్యోగాలిప్పిస్తాంటూ నకిలీ కాల్స్

గద్వాల అర్బన్: 'మీకు విద్యుత్ శాఖలో ఉద్యోగం కావాలా..? అయితే ఈ నంబర్‌కు డబ్బులు ఫోన్ పే చేయండి, మీకు ఎలాంటి నోటిఫికేషన్, ఇంటర్వ్యూ లేకుండానే సులువుగా కొలువు ఇప్పిస్తామంటూ అపరిచిత వ్యక్తులు నిరుద్యోగులకు ఫేక్ కాల్స్ చేసిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో వెలుగు చూసింది. గద్వాల ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన ఇద్దరు నిరుద్యోగులకు అపరిచిత వ్యక్తులు ఫోన్ కాల్ చేసి, మీకు గద్వాల విద్యుత్ శాఖ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పారు. సదరు అప్లికేషన్ కోసం ఫోన్ పేకు డబ్బులు పంపాలని చెప్పగా.. నమ్మిన సదరు నిరుద్యోగులు ఒక్కొక్కరు రూ.1400 డబ్బులు ఫోన్ పే చేశారు. అనంతరం అనుమానం వచ్చి గద్వాలలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సంప్రదించగా.. తమ శాఖలో ఎలాంటి ఖాళీలు లేవని, ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వలేదంటూ చెప్పామని ఏఈ శ్రీనివాసులు వివరించారు. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించామన్నారు. ట్రాన్స్‌కోలో ఖాళీల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి, రాత పరీక్ష ద్వారానే నియామకాలు చేపడుతుందని, ఎవరూ కూడా నకిలీ కాల్స్‌ను నమ్మరాదని, నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

ప్రతిభా పురస్కారాలు అందజేత

అయిజ: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ స్థాపించిన జై నడిగడ్డ యువత అధ్యక్షతన శుక్రవారం మండలంలోని పదవ తరగతి, ఇంటర్మీడియట్ తరగతుల్లో మొదటి రెండు ర్యాంకుల సాధించిన విద్యార్థులను మెమెంటో, శాలువాలతో సన్మానించారు. జై నడిగడ్డ జిల్లా సమన్వయకర్త వీరేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి జిల్లా నోడల్ అధికారి హృదయరాజు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీఓ సాయిప్రకాష్ పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్యంతో సమావేశం

శాంతినగర్: పట్టణ పరిధిలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంతో శుక్రవారం బీజేపీ రాష్ట్ర ఎడ్యుకేషనల్ సెల్ కన్వీనర్ బంగి లక్ష్మణ్ సమావేశమయ్యారు. విద్యార్థులపై కొంతమంది ఉపాధ్యాయులు మతపరమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వస్తున్న ఆరోపణలతో పాఠశాలను సందర్శించారు. పాఠశాల నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అన్ని మతాల విద్యార్థులను సమానంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు ఆర్‌కే నాయుడు, నాయకులు వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి, వీబీ రామ్, వీరన్న, శశి, ఆంజనేయులు, గోవిందు, ఎల్ఐసీ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు బలోపేతం చేయాలి

శాంతినగర్: కిశోర బాలికల సంఘాలను బలోపేతం చేయాలని ఎంవీ ఫౌండేషన్ మండల కో ఆర్డినేటర్ హనిమిరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కొంకలలో క్లస్టర్ స్థాయి కిశోరబాలికల సంఘాల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలికల ఉన్నత చదువులు, బాల్యవివాహాలు, జెండర్, బాలల హక్కులు, 1098, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెంకటనర్సమ్మ పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో ప్రముఖులు



దుర్గారెడ్డి దంపతులకు శేష వస్త్రాలు అందజేస్తున్న ఈఓ

జోగుళాంబ శక్తి పీఠం: జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శుక్రవారం ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ దుర్గారెడ్డి దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి పురేందర్‌కుమార్ స్వాగతం పలికారు. ఆయన జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేసి శేష వస్త్రాలతో సత్కరించి వేద ఆశీర్వచనం చేశారు.

అస్తవ్యస్తంగా బీఆర్ఎస్ పాలన

అయిజ: అస్తవ్యస్తంగా బీఆర్ఎస్ పాలన ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జయన్న అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయన్నారు. పెద్ద వాగు నిర్మాణంతో దారి మళ్లించారని ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో విఫలం అయ్యారన్నారు. వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని జింకలపల్లిలో శుక్రవారం సీఎస్సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని లేబర్ కార్డు కలిగి ఉన్న 41 మంది కార్మికులకు డాక్టర్ ఫరూక్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో ప్రశాంత్‌కుమార్, వైద్య సిబ్బంది, సిఎస్‌సి సిబ్బంది, తదితరులు ఉన్నారు.

అవకతవకలకు పాల్పడిన 20 మందికి నోటీసులు



ఈజీఎస్ అధికారులను విచారణ చేస్తున్న డీఆర్‌డీఓ ఉమాదేవి

ఉండవెల్లి: సామాజిక ఆడిట్‌లో భాగంగా రెండో విడతలో చేపట్టిన తనిఖీల్లో అవకతవకలకు పాల్పడిన 20 మందికి నోటీసులు జారీ చేసినట్లు డీఆర్‌డీఓ ఉమాదేవి తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 2020–23 లో చేపట్టిన రూ.8,17,15,70 ఎన్ఆర్ఈజీఎస్ పనులపై ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈనెల 11 నుంచి 22తేదీ వరకు 30 మంది సామాజిక తనిఖీల్లో పాల్గొని నివేదికలు సేకరించారు. మొత్తం నివేదికలు పరిశీలించిన జిల్లా అధికారులు 20 మంది అధికారులకు నోటీసులు జారీచేశారు. 14 మంది పంచాయతీ కార్యదర్శులకు, నలుగురు టెక్నికల్ అసిస్టెంట్‌లకు, 10 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లకు నోటీసులు ఇచ్చినట్లు డీఆర్‌డీఓ వివరించారు. 16 గ్రామ పంచాయతీల్లో 4 పంచాయతీలు మినహా 12 పంచాయతీల్లో మొత్తం రూ 24,694 అవకతవకలు జరిగాయని అధికారులు నిర్ధారించారు. వాటిలో రూ.7694 రికవరీ చేయగా రూ.17,000 వసూలు చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మాట్లాడుతూ పనుల్లో నిర్లక్ష్యం చేయడమేకాకుండా ఉన్నతాధికారుల ఆదేశాలు చాలా మంది పాటించడంలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీసమ్మ, వైస్ ఎంపీపీ దేవన్న, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ పద్మావతి, ఏపీఓ విజయ శంకర్, ఎస్ఆర్‌పి ప్రభాకర్‌రెడ్డి, డీవీఓ శ్రీనివాసులు, అంబుడ్స్ పర్సన్ జమ్మన్నలు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

అయిజ: మండలంలోని యాపదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు శివశంకర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చిన పుస్తకాలను, నోట్‌బుక్స్‌ను విద్యార్థులకు ఉచితంగా అందించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.విద్యాకమిటీ చైర్మన్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు సాజీదా బేగం, పక్కిరన్న, లింగారెడ్డి, బాబు, ప్రభాకర్ ఉన్నారు.



పాఠ్యపుస్తకాలతో విద్యార్థులు

సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం



ధరూరు: సీఎం కేసీఆర్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిల చిత్ర పటాలకు ర్యాలంపాడు గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన ర్యాలంపాడు రిజర్వాయర్ కింద ముంపునకు గురైన ర్యాలంపాడు ముంపు గ్రామస్తులకు షిఫ్టింగ్ చార్జెస్ కింద డబ్బులు జమ చేశారు. దీంతో వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, గద్వాల ఎమ్మెల్యే చిత్ర పటాలకు గ్రామస్తులు పాలాభిషేకం చేశారు.

శిథిలాలు తొలగిస్తాం

అలంపూర్: ఉర్దూ పాఠశాలలో ఉన్న శిథిలాలను వెంటనే తొలగిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని ఉర్దూ పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలకు వెళ్లాల్సిన దారిలో కంకర కుప్పలు, దుకాణ డబ్బాల శిథిలాలు అడ్డంగా ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల హెచ్‌ఎం షాహిన్ బేగం మున్సిపల్ చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలను సందర్శించి అక్కడి పరిసరాలను పరిశీలించారు. వీరితోపాటు వీఆర్ఏ రామచందర్, మున్సిపల్ సిబ్బంది రామంజనేయులు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర అధికార ప్రతినిధిగా శేక్షావలి ఆచారి

అయిజ: మున్సిపాలిటీలోని 19వ వార్డు కౌన్సిలర్ మాస్టర్ శేక్షావలి ఆచారి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ నియామక పత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు.

సెక్యూరిటీ గార్డుపై దాడి

గద్వాల క్రైం: జిల్లా ప్రభుత్వాసుపత్రిలో సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్న పరశరాముడిపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం 11 గంటలకు గద్వాల మండలానికి చెందిన ఓ బాలింతను డిశ్చార్జి చేశారు. బాలింతను ఇంటికి తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు ఆస్పత్రికి వచ్చారు. లోపలికి వెళ్లేందుకు ఒకరికే అనుమతి ఉందని సెక్యూరిటీ గార్డు వారికి తెలపాడు. అందరం వెళ్తామని సెక్యూరిటీ గార్డుతో వాగ్వివాదానికి దిగారు. ఇద్దరి మధ్య మాటమాట పెరిగి బాలింత కుటుంబసభ్యుల్లో ఒకరు సెక్యూరిటీపై దాడి చేశాడు. గమనించిన సిబ్బంది, స్థానికులు అడ్డుకున్నారు. ఈ సంఘటనపై సెక్యూరిటీ సిబ్బంది ఆర్ఎంకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆర్ఎం వృశాలీ తెలిపారు.

జ్ఞాన సరస్వతి ఆలయంలో పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సరస్వతి దేవిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని సరస్వతీదేవిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

హైందవ పద్ధతిలో ముస్లిం దంపతుల పూజ

జోగుళాంబ శక్తిపీఠం: ఐదో శక్తి పీఠమైన జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ముస్లిం మైనార్టీకి చెందిన దంపతులు వాహన పూజ చేశారు. హైందవ పద్ధతిలో పూజ చేయించి ఆదర్శంగా నిలిచారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

గద్వాల అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించడంలో విఫలం అయ్యారని అంగన్‌వాడీ టీచర్స్ అండర్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న ఆదిలాబాద్ నుంచి ప్రారంభించిన జీపుజాతా శుక్రవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చి తొమ్మిదేళ్లైనా అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. కనీస వేతనం, ఈఎస్ఐ పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, డీఏ అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎమేలమ్మ, నర్మద, నర్సమ్మ, పుష్ప, రేణుక, వీవీ నర్సింహ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జయలక్ష్మి

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం



గద్వాలలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రాపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



అయిజలో శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న నాయకులు

గద్వాల: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక డీకే బంగ్లాలోని పార్టీ కార్యాలయంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాముఖర్జీ చిత్రాపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పండిట్ నెహ్రూ క్యాబినెట్‌లో విదేశాంగ మంత్రిగా సేవలందించారన్నారు. అనంతరం బీజేపీ నాయకులు వార్డుల వారిగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా ఈ నెల 25న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగే బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బహిరంగ సభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బహిరంగ సభ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో గడ్డం కృష్ణారెడ్డి, రవికుమార్, రామంజనేయులు, బండల వెంకట్రాములు, సంజీవయ్య, జయశ్రీ, నర్సింహ, పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి

అయిజ: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి చేస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన ముఖర్జీ 70వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ దేశ సమైక్యత కోసం శ్యాంప్రసాద్ ముఖర్జీ ఎంతో కృషి చేశారన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి ఆయన కలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సాకారం చేశారన్నారు. నాయకులు గోపాలకృష్ణ, ఆంజనేయులు, వెంకటేష్ యాదవ్, తిరుమలేష్, నర్సన్ గౌడ్, రాజు, కృష్ణ, గోపాల్, రమేష్, మల్లేష్, గోవిందు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

శాంతినగర్: పట్టణంలో భారతీయ జనసంఘ్ పార్టీ అధ్యక్షుడు దివంగత డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ 70వ వర్ధంతిని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ తిరుమల రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

అమరచింత: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యాదినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న బాలస్వామి, అరుణ, కె.కృష్ణయ్య, హరిత ను శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ కలాంపాషా, సీఆర్పీ స్వామి, ఉపాధ్యాయులు రమేష్, కిరణ్, బాల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

మానవపాడు: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందని ఎంఈఓ శివప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నిపాడు పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు రాయడం, చదవటం తప్పనిసరిగా రావాలని విద్యార్థులకు అనుగుణంగా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చెన్నిపాడు పాఠశాలలోని సైన్స్ టీచర్ జ్యోతి జిల్లాస్థాయిలో ఉత్తమ టీచర్‌గా ద్వితీయ బహుమతి అందుకోవడంతో ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విష్ణువర్ధన్, రి యా జ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



చెన్నిపాడులో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఎంఈఓ శివప్రసాద్

ప్రత్యేక హెల్త్ క్యాంపు

మానవపాడు: మండలంలోని పల్లెపాడులో శుక్రవారం ఎస్‌బీఐ ఫౌండేషన్, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహించారు.దీ సందర్భంగా భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ నాగరాజు మాట్లాడుతూ గ్రామంలో 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డా. సురేష్‌కుమార్, ఆనంద్ బాబు, పార్మసిస్ట్ తస్లీమాభాను, ల్యాబ్ టెక్నిషియన్ రామచంద్రనాయుడు, షబ్బీర్ అలీ, ఇందిరమ్మ, ఆశలు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి

అలంపూర్: రైతులకు విత్తనాలు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఏడీఏ సక్రియా నాయక్ అన్నారు. శుక్రవారం అలంపూర్ చౌరస్తాలో ఉండవెల్లి మండల విత్తన డీలర్లకు ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణకు ఏడీఏ సక్రియానాయక్, ఇన్‌చార్జ్ వ్యవసాయ శాఖ అధికారిణి శ్రీలత, విత్తన డీలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు లైసెన్సులు పొందిన విత్తన డీలర్లు ఇతర లైసెన్స్‌లను ఆన్‌లైన్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలో డెమో పద్ధతిలో వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



ఏ.బుర్దిపాడులో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సక్రియానాయక్

మానవపాడు: పత్తి పంటన సందర్శించి పంటలో ఆశించిన చీడపీడల తెగులు పరిశీలించి, ఎర్ర తెగులు ఆశించినట్లు గుర్తించామని ఏడీఏ సక్రియానాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఏ.బుర్దిపాడులో పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలో శుక్రవారం ఎర్ర తెగులు సోకిన పత్తి పంటను ఏడీఏ సంగీత లక్ష్మి పరిశీలించారు. ఎర్రతెగులు నివారణకు రైతులు తీసుకోవాలసిన జాగ్రత్తలను అమె వివరించారు.

గట్టు: రైతులు తొందర పడి విత్తనాలను విత్తుకోవద్దని, 60 సెంటీమీటర్ల వర్షం కురిసిన తర్వాత భూమి చల్లబడుతుందని, అప్పుడే విత్తనాలు విత్తుకుంటే మంచిదని తెలిపారు. శుక్రవారం ఇందువాసి, మిట్టదొడ్డి గ్రామాల శివారుల్లోని పత్తి పంటలను ఆమె పరిశీలించారు.